క్లుప్తంగా

పెళ్లి కానుక అందజేత

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో ఇటీవల వివాహం చేసుకున్న 21 మంది యువతులకు ఆ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి గురువారం ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున కల్యాణ కానుక అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ యాదగిరిగౌడ్, సర్పంచ్ కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పెద్దబోయిన సత్తయ్యయాదవ్, మాజీ ఎంపీటీసీ ఆవుల నర్సింహ, ఉప సర్పంచ్ ఉయ్యాల లింగయ్యగౌడ్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఉయ్యాల నాగరాజుగౌడ్, సుంకరబోయిన నర్సింహ, చిన్న నర్సింహ, సాగర్ల భిక్షం పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ టౌన్ : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై తగిన చర్యలు తీసుకోవాలని యాదవ కుర్మల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లొడంగి గోవర్ధన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా ఈ నెల 20న జిల్లా కేంద్రంలో దున్నపోతులతో నిరసన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి జెడ్పీ హెచ్ఎస్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం నర్సింగరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన ఎస్‌కె.ఖాజ అబ్దుల్ ఖాదర్, రత్నం లోకేష్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నకిరేకల్ : రోడ్డు విస్తరణ పనుల కారణంగా నకిరేకల్ పట్టణంలోని కాటమయ్య బజార్, వీటీ కాలనీ, చీమలగడ్డ, పటేల్ నగర్, సంతోష్ నగర్, మూసీ రోడ్డు, ఆఫీసర్స్ కాలనీ, శివాజీ నగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 6 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ సాయి గణేశ్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మర్రిగూడ తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు



మర్రిగూడ : మర్రిగూడ మండల తహసీల్దార్‌గా దేవులపల్లి వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ పి. శ్రీనివాస్‌రెడ్డి కట్టంగూర్‌కు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లుకు డిప్యూటీ తహసీల్దార్ తారకరామన్, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా యాసరాని దినేష్



మునుగోడు : కాంగ్రెస్ పార్టీ మునుగోడు పట్టణ అధ్యక్షుడిగా యాసరాని దినేష్ ఎన్నికయ్యారు. గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహ గౌడ్ సమక్షంలో మునుగోడులో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో దినేష్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా గంగోరిగూడెం గ్రామశాఖ అధ్యక్షుడిగా జనగాం జంగయ్య గౌడ్, పులిపలుపుల అధ్యక్షుడిగా జనగాం వెంకటయ్య గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ పోలగోని సత్యం గౌడ్, నన్నూరి విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, పాల్వాయి చెన్నారెడ్డి, మేక ప్రదీప్ రెడ్డి, సూర్యప్రకాష్ గౌడ్, రాజభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

నల్లగొండ టౌన్ : తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ జిల్లా సదస్సును ఈ నెల 24న యాదవ సంఘం భవన్‌లో నిర్వహించనున్నట్లు తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ జిల్లా కన్వీనర్ ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానికంగా సదస్సు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మురళి, నజీరొద్దీన్, ప్రభాకర్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

చండూరు : సీపీఆర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చండూరు ఎంపీపీ పల్లె కళ్యాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ అన్నారు. గురువారం ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో అంగన్ వాడీ వర్కర్లకు, మున్సిపల్ సిబ్బందికి, మహిళలకు సీపీఆర్‌పై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ మొయిజుద్దీన్, ఈఈ అరవింద్ రెడ్డి, మెడికల్ అధికారి మాస రాజు, వార్డు అధికారులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మెడికల్ అధికారి మాస రాజు

పేరుకుపోయిన ధాన్యం నిల్వలు



ఆకారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం రాశులు



శాలిగౌరారం మార్కెట్ యార్డులో పేరుకుపోయిన ధాన్యం బస్తాలు

- కొనుగోలు కేంద్రాల్లో 1.20 లక్షల క్వింటాళ్ల ధాన్యం నిల్వలు
- దిగుమతులకు నోచుకోక మిల్లుల వద్ద లారీల పడిగాపులు
- ఆందోళనలో అన్నదాతలు

శాలిగౌరారం : ఆరుగాలం కష్టపడిన రైతుకు అన్నీ కష్టాలే. పంట సాగు మొదలుకొని వచ్చిన పంట దిగుబడులు అమ్ముకునేవరకు అన్నీ అవస్థలే. శాలిగౌరారం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు సరిగ్గా జరగకపోవడంతో ఎక్కడి ధాన్యం అక్కడే నిలిచిపోయింది. నెలరోజులకు పైగా కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు.

13 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

శాలిగౌరారం మండలంలో యాసంగి ధాన్యం కొనుగోలు కోసం ప్రభుత్వం 13 కేంద్రాలను గత నెల 16న ప్రారంభించింది. వాటిలో ఐకేపీ 7, పీఏసీఎస్ 4, ఎన్‌డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 2 కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. ఐకేపీ ఆధ్వర్యంలో గురుజాల, భైరవునిబండ, మనిమద్దె, చిత్తలూరు, రామాంజాపురం, రామగిరి, ఆకారం, పీఏసీఎస్ ఆధ్వర్యంలో శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెం, అడ్లూరు, మాధారంకలాన్, ఎన్‌డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఎన్‌జి కొత్తపల్లి, తుడిమిడి కేంద్రాలు ఉన్నాయి.

1.20 లక్షల క్వింటాళ్లు నిల్వ..

మండలంలోని ఇప్పటివరకు నెలరోజుల వ్యవధిలో ఆయా కేంద్రాల ద్వారా 1.05 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. మరో 1.20 లక్షల క్వింటాళ్ల ధాన్యం రాశులు నిల్వ ఉన్నాయి. ఆయా కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే కొనుగోలు జరిగి తూకంవేసిన 15 వేల బస్తాలు నిల్వ ఉన్నాయి. అందులో ఐకేపీ కేంద్రాల్లో 8 వేల బస్తాలు, పీఏసీఎస్ కేంద్రాల్లో 7 వేల బస్తాలు నిల్వ ఉన్నాయి. ధాన్యం రవాణాకు లారీల కొరత ఏర్పడడంతో మూడు రోజులుగా ధాన్యం బస్తాలు ఎండలో ఎండుతున్నాయి.

మిల్లర్ల పేచీలు

ధాన్యం నాణ్యతగా ఉన్నప్పటికీ తాలు, పొట్టిపాడవు గింజల పేరిట దిగుమతి చేసుకోకుండా మిల్లర్లు పేచీలు పెడుతున్నారు. దీంతో రైతులు మిల్లుల వద్దకు వెళ్లి మిల్లర్లతో తూకం కోతలకు ఒప్పందం చేసుకోవలసిన పరిస్థితులు వస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే ధాన్యం బస్తాలు నిల్వ ఉండడంతో కేంద్రాల నిర్వాహకులు తిరిగి ధాన్యం కొనుగోళ్లు చేయకుండా నిలిపివేశారు. రైతుల ఇబ్బందికర పరిస్థితులను ఆసరాగా చేసుకున్న మిల్లర్లు క్వింటాకు అదనంగా 5 కిలోల ధాన్యం తూకం వేస్తేనే దిగుమతి చేసుకుంటామని భీష్మించుకొని కూర్చోవడంతో విధిలేని పరిస్థితుల్లో రైతులు ఒప్పుకోక తప్పడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి శాలిగౌరారం మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం ఎగుమతులు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం రాశులతోపాటూ తూకం వేసిన బస్తాల నిల్వలు పేరుకుపోయాయి. లారీలు రాకపోవడంతో మూడు రోజులుగా ఎక్కడి బస్తాలు అక్కడే ఉన్నాయి. అధికారుల స్పందించి ధాన్యం కొనుగోళ్లు, ఎగుమతులు వేగవంతం చేయాలి.

– చామల జితేందర్‌రెడ్డి, రైతు, శాలిగౌరారం

అధికారుల దృష్టికి తీసుకుపోతున్నాం



లారీల కొరత వల్ల కొనుగోళ్లు వేగవంతం చేయలేకపోతున్నాం. ట్రాక్టర్లను కూడా రవాణాకు వినియోగించుకోవాలని రైతులకు తెలియజేశాం. లారీల కొరత, మిల్లుల వద్ద ఇబ్బందులు, కొనుగోలు కేంద్రాల్లో నిల్వల పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకుపోతున్నాం. – నిమ్మల ఆంజనేయులు, పీఏసీఎస్ సీఈఓ, శాలిగౌరారం

తిప్పర్తి ఎస్ఐగా రవి

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి ఎస్ఐ వాస ప్రవీణ్ కుమార్‌ను డీసీఆర్బీకి అటాచ్ చేస్తూ ఎస్పీ అపూర్వ రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో సూర్యాపేట జిల్లా మఠంపల్లి ఎస్ఐ ఇరుగు రవి రానున్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



దీక్షలో కూర్చున్న ఆర్ఎంపీలు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు 28వ రోజు చేరారు. గురువారం దీక్షలో ఆర్ఎంపీలు కుర్చున్నారు. ఆర్ఎంపీలకు ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులుతో పాటు కమిటీ సభ్యులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీలు వెంకటేష్, అశోక్, రాములు, అనంతరెడ్డి, రాఘవులు, యాదయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ పాల దందా అరికట్టాలి

నల్లగొండ టూటౌన్ : జిల్లాలో కల్తీ పాల దందా అరికట్టాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. పాల కల్తీకి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజు వేల లీటర్ల పాలను కల్తీ చేస్తున్నారని వివరించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కల్తీ పెరిగిపోయి ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో డీవైఎఫ్ఐ నాయకులు గుండాల నరేష్, కోరే నరేష్, శ్రీనివాస్, ఏడుకొండలు, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

'మాదగోని' జన్మదిన వేడుకలు



రక్తదానం చేస్తున్న యువకులు

నల్లగొండ టూటౌన్ : బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ జన్మదినం సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ యువసేన ఆధ్వర్యంలో గురువారం పెద్దగడియారం సెంటర్‌లో బీజేపీ కార్యకర్తలు రక్తదానం చేశారు. అదేవిధంగా మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, పోతెపాక సాంబయ్య, షేక్ శ్యాంప్రసాద్, అఫ్రోస్ పాల్గొన్నారు. దళిత మోర్చా పట్టణ అధ్యక్షుడు గాలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని నెహ్రూగంజ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దళిత మోర్చా పట్టణ ఉపాధ్యక్షుడు బాషపాక కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

సంస్థాన్ నారాయణపురం: కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం 27మందితో కూడిన పూర్తి మండల స్థాయి కమిటీని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఏపూరి సతీష్, గూడూరు వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్



హాజరైన అధికారులు

నల్లగొండ : మున్సిపాలిటీల్లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో మెరుగైన స్థానం సాధించాలన్నారు. మున్సిపాలిటీల్లో చేపట్టిన ల్యాండ్ పూలింగ్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల ఇంజనీర్లు, ఈఈ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పించాలి

ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి జీపీలో సరాసరి 200 మంది కూలీలకు పనులు కల్పించాలని అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ నుంచి డివిజనల్ పంచాయతీ అధికారులు, ఏపీడీలు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. కూలీలకు రోజువారి వేతనం రూ.272 వచ్చేలా పనులు కల్పించాలన్నారు. నర్సరీలలో మొక్కలకు షేడ్ నెట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. క్రీడా ప్రాంగణాలకు సరఫరా చేసిన క్రీడా పరికరాలు ప్రాంగణాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి, డీఆర్‌డీఏ ఏపీడీ శైలజ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం




నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల

కనగల్ : మండలంలోని శేరి లింగోటం గ్రామానికి చెందిన మండలి అరుణ ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా.. గతంలో ఆమె భర్త కూడా అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో అనాథలైన వారిద్దరి పిల్లలకు ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి గురువారం తక్షణ సహాయంగా రూ.10 వేల నగదు అందజేశారు. వారిని గురుకుల పాఠశాలలో చేర్పించి చదువులకు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా అనాథ పిల్లలకు ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజు రూ.10 వేలు అందజేశారు. వారి వెంట మార్కెట్ చైర్మన్ పంకజ్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ మండలధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహదేవరెడ్డి, స్థానిక సర్పంచ్ ఆవురేశి క్రాంతిశ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నకిరేకల్ : మండలంలోని గోరెంకలపల్లి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ కుమారుడు మదన్ సాయిని గురువారం కాంగ్రెస్ పార్టీ నేత దైద రవీందర్ పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట గార్లపాటి రవీందర్‌రెడ్డి, జాజుల నాగయ్య, పల్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కుంచం లింగయ్య చింటు ఉన్నారు.

మునుగోడు : మండలంలోని చొల్లేడు గ్రామానికి చెందిన కొంక శంకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబానికి చొల్లేడు సర్పంచ్ జనిగల మహేశ్వరిసైదులు గురువారం రూ. 10 వేల ఆర్థికసాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వనం నిర్మలయాదయ్య, ఉప సర్పంచ్ గోదాల శంకర్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుడిగపాక ఏసు, వనం లింగయ్య, దోటి నాగరాజు, శంకర్, యాదయ్య, రవి, లింగస్వామి, వెంకన్న, చంద్రయ్య, సైదులు పాల్గొన్నారు.

పచ్చటి చెట్లతో వాహనదారులకు ఉపశమనం



రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు

మునుగోడు : రోజురోజుకూ ఎండలు మండిపోతుండడంతో వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారు. ఎక్కడైనా తాము వెళ్తున్న దారిలో చిన్నపాటి నీడ ఉంటే చాలు కొద్దిసేపు సేదతీరి తిరిగి తమ ప్రయాణం కొనసాగిస్తున్నారు. మునుగోడు నుంచి చండూరుకు వెళ్లే ప్రధాన రహదారిలో పచ్చటి చెట్లు వాహనదారులకు ఉపశమనం కలిగిస్తున్నాయి. దాదాపు 300 మీటర్ల వరకు రోడ్డుకు ఇరువైపులా పెద్దపెద్ద చెట్లు ఉండడంతో ఆ ప్రదేశం అంతా చల్లని నీడలో ఉండి కనువిందు చేస్తోంది. ఆ దారి వెంట వెళ్లే వాహనదారులు కాసేపు చెట్ల కింద నిల్చుని వెళ్తున్నారు.

రైతులను ఆదుకోవాలి

మర్రిగూడ : అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వైఎస్సార్ టీపీ మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వనమాల ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి ఆర్థికంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సి ప్రభుత్వం ఇప్పటివరకు సాయం అందించలేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేల నుంచి రూ.40వేల నష్టపరిహారం అందించాలన్నారు.

హామీల అమలులో విఫలం

సంస్థాన్ నారాయణపురం: మునుగోడు ఉప ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని బీఎస్పీ మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ అందోజు శంకరాచారి అన్నారు. మండల కేంద్రంలో గురువారం బీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ అధ్యక్షుడు గండు నాగేంద్ర బాబు, ప్రధాన కార్యదర్శి కత్తుల నర్సింహ, నారాయణపురం, నాంపల్లి, చండూర్ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



చండూరులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు



కేతేపల్లి : ఎరువుల దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ అనిల్‌రెడ్డి, ఏఓ పురుషోత్తం

చండూరు : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి మల్లేశ్, ఎస్ఐ నవీన్ కుమార్ హెచ్చరించారు. గురువారం చండూరులోని పలు ఫర్టిలైజర్ షాపులను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లు రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలను అందించాలని ఆదేశించారు. రైతులు లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాల బిల్లులను, ఖాళీ ప్యాకెట్లను సీజన్ అయిపోయేంత వరకు భద్రపరచుకోవాలని అన్నారు.

కేతేపల్లి : నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అనిల్‌రెడ్డి హెచ్చరించారు. ఎస్పీ అపూర్వరావు ఆదేశాల మేరకు గురువారం మండలంలోని అన్ని ఎరువుల దుకాణాలను ఏఓ పురుషోత్తంతో కలిసి ఆయన తనిఖీ చేశారు. విత్తనాలు కొన్న రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని దుకాణాదారులకు సూచించారు. నకిలీ విత్తనాల పట్ల రైతులు జాగ్రత్త వహించాలన్నారు, ఎవరైనా ధ్రువీకరించని విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనుమతులున్న దు కాణాల్లోనే రైతులు విత్తనాలు, ఎరువులు కొనాలన్నారు.

కనగల్ : మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న విత్తన విక్రయ దుకాణాలను ఎస్ఐ నాగేష్, మండల వ్యవసాయాధికారి అమరేందర్‌గౌడ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా రైతులు నాణ్యమైన పత్తి, వరి విత్తనాలను చెక్ చేసి తీసుకోవాలన్నారు.

అక్రమ పట్టా రద్దు చేయాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నకిరేకల్ : మండలంలోని మర్రూర్ గ్రామంలో గ్రామ కంఠం భూమితోపాటు ప్రజలు నివాసం ఉండే స్థలాలను అక్రమంగా పట్టా చేసుకుని రైతు బంధు తీసుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకుని అక్రమ పట్టా రద్దు చేయాలని కోరుతూ మర్రూరు గ్రామస్తులు గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్తాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ నర్సింగ్ భిక్షం అనే వ్యక్తి గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉన్న పాత ఇళ్ల స్థలాలను కొని వాటితోపాటు గ్రామ కంఠానికి చెందిన వీధులను కలుపుకుని వ్యవసాయ భూమిగా మార్చుకున్నాడని పేర్కొన్నారు. బజారులో ఉన్న బోరు చుట్టూ వ్యవసాయం చేస్తూ బోరు వద్దకు దారి లేకుండా చేస్తున్నాడని ఆరోపించారు. దీంతోపాటు 100 ఇళ్ల స్థలాలకు సంబంధించి సుమారు 7 ఎకరాల భూమిని తన పేరు మీద పట్టా చేసుకుని రైతు బంధు కూడా పొందుతున్నాడని వివరించారు. వినతి ప్రతం అందించిన వారిలో పుట్ట శైలజ దశరథ, నర్సింగ్ రాములు, మిర్యాల సైదులు, గంజి ఉపేందర్, పున్న కేశవులు, పున్న యాదగిరి, జక్కల నాగరాజు, లొడంగి ఉపేందర్, గద్దె సతీష్, చెవుల భిక్షం, పుట్ట రవణమ్మ తదితరులు ఉన్నారు.

క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ ముత్తిలింగయ్య

కట్టంగూర్ : క్రీడాకారులు గెలుపోటములు పట్టించుకోకుండా స్నేహభావంతో మెలిగి క్రీడాస్ఫూర్తిని చాటుకోవాలని ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, జెడ్పీటీసీ తరాల బలరాములు అన్నారు. కట్టంగూర్ హైస్కూల్‌లో నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రశంసా పత్రాలు, బహుమతులను వారు అందజేసి మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక ధారుడ్యం పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పోరెళ్ల సునిత, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, ఎంపీఓ అథర్‌ఫర్వేజ్, పీడీ విజయ్‌కుమార్, ఏపీఓ రాంమోహన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, గద్దపాటి దానయ్య, బొల్లెద్దు యాదయ్య, మేకల రమేష్, అంతటి శ్రీను, పీడీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్తంభాలు నాటారు.. కనెక్షన్ మరిచారు !



బోయగుబ్బలో విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన స్తంభాలు

చిట్యాల : ఏడెనమిది నెలల క్రితం వర్షాలకు విరిగి పడిన విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేసినప్పటికీ విద్యుత్ కనెక్షన్ ఇచ్చే విషయంలో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చిట్యాల మండలం బోయగుబ్బ గ్రామ శివారులోని వ్యవసాయ బావుల వద్ద ఏడెనమిది నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు రైతు గంధమల్ల భీమార్జున్‌కు చెందిన వ్యవసాయ బావి సమీపంలోని విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. గుర్తించిన విద్యుత్ అధికారులు నూతనంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. కానీ నేటి వరకు ఆ విద్యుత్ స్తంభాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు. దీంతో పలువురు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్‌స్తంభాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం

కనగల్ : మండల పరిధిలోని చెట్లచెన్నారం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం సర్పంచ్ గన్నెబోయిన గంగమ్మచంద్రయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లేష్, కార్యదర్శి రాధిక, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చండూరు : మండల పరిధిలో చామలపల్లి, బోడంగిపర్తి గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ పల్లె కళ్యాణి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చామలపల్లి సర్పంచ్ ముడిగ ఎర్రన్న, బోడంగిపర్తి సర్పంచ్ రాణి పాల్గొన్నారు.

మర్రిగూడలో వైద్యశిబిరం

మర్రిగూడ : మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త నల్లా పాండు ద్వితీయ వర్ధంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో సర్పంచ్ నల్లా యాదయ్య ఆధ్వర్యంలో నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ప్రజలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ రంగారెడ్డి, వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, విజయరామారావు, నల్లా వెంకన్న, దామెర భీమనపల్లి ఎంపీటీసీ సిలివేరు విష్ణు, పందుల రాములు, కాసర్ల అంజయ్య, రఘు, వార్డు మెంబర్లు, కామినేని వైద్య బృందం నర్సింహ, మాధురి, చంద్రారెడ్డి, నిఖిత, మమత, లిఖిత, సుష్మిత, పీఆర్‌ఓలు సతీష్, కల్యాణ్, చంద్రశేఖర్, సాయిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐ రంగారెడ్డికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని కత్తుల అలివేలుకు ఎన్నారై శ్రీకాంత్ రావినూతల సమకూర్చిన రూ.50 వేల నగదును గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు గుత్తా అమిత్‌రెడ్డి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా గుత్తా అమిత్‌రెడ్డి మాట్లాడుతూ వైద్య విద్యార్థినికి ఎన్నారై శ్రీకాంత్ రావినూతల ఆర్థికసాయం చేయడం అభినందనీయమన్నారు. తమ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

జంగయ్య మృతి పార్టీకి తీరని లోటు

మర్రిగూడ : మండలంలోని తిరగండ్లపల్లి సీపీఐ సీనియర్ నాయకుడు మావిళ్ల జంగయ్య మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. గురువారం జంగయ్య దశదిన కర్మకు హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు చల్లా పాండురంగారావు, కార్యవర్గ సభ్యుడు ఎరుకల నిరంజన్, పార్టీ నాయకులు అల్వాల నర్సింహ, బాలకిషన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.